# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆసియా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలకు భారత్ "యాక్ట్ ఈస్ట్ పాలసీ" నూతన ఉత్తేజాన్ని ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **రాష్ట్రంలో రేషన్ కార్డుపై తక్కువ ధరకే వంటనూనెలను విక్రయించనున్నట్లు అంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
3. **కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు కేటాయించే నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.**
4. **తెలంగాణలో ఆదాయ మార్గాల ద్వారా నిధుల సమీకరణ పై దృష్టి సారించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
5. **సమాజంలో బాలికల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ రోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

ఆసియా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలకు భారత్ "యాక్ట్ ఈస్ట్ పాలసీ" నూతన ఉత్తేజాన్ని ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. లావోస్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నిన్న 21వ ఆసియాన్ – ఇండియా సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ శతాబ్దం.. భారత్, ఆసియాన్ దేశాల శతాబ్దమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో సంఘర్షణ, ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న సమయంలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య స్నేహం, సమన్వయం, సంభాషణలు, సహకారం చాలా ముఖ్యమైనవని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (20 సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో రేషన్ కార్డుపై తక్కువ ధరకే వంటనూనెలను విక్రయించనున్నట్లు అంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో వంటనూనెల సరఫరాదారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వర్తక సంఘాల ప్రతినిధులతో నిన్న నిర్వహించిన సమావేశంలో ధరల నియంత్రణపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెలాఖరు వరకు లీటరు పామాయిలును 110 రూపాయాలు, సన్‌ఫ్లవర్ నూనె లీటరు 124 రూపాయాల చొప్పున ఒక్కో రేషన్ కార్డుపై మూడు లీటర్ల పామాయిలు, ఒక లీటరు సన్‌ఫ్లవర్ నూనె చొప్పున నిర్ణయించిన ధరలపై అందించనున్నట్లు వివరించారు.

వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ధరలు కాకుండా.. రాష్ట్రమంతా ఒకే ధరకు విక్రయించాలని వ్యాపారులకు మంత్రి సూచించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 17వ తేదీన వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించనున్నామని రాష్ట్ర బీసీ, సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో అనంతపురంలో వాల్మీకి జయంతిని నిర్వహించనున్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి  కలెక్టర్లకు ఆదేశాలు జారీచేయనున్నట్లు మంత్రి తెలిపారు.

---

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు కేటాయించే నిధులను కేంద్ర ప్రభుత్వం నిన్న విడుదల చేసింది. మొత్తం లక్షా 78 వేల 173 కోట్ల రూపాయల పన్ను వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. వీటిలో ముందస్తు వాటాగా 89 వేల 86.50 కోట్లతో కలిపి మొత్తం లక్షా 78 వేల 173 కోట్ల రూపాయలను విడుదల చేసింది. రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమ వ్యయాలకు ఆర్థిక సహాయం కింద ముందస్తు వాయిదాలను విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వివరించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 7 వేల 211 కోట్ల రూపాయలు విడుదల చేయగా, తెలంగాణకు 3 వేల 745 కోట్ల రూపాయలను విడుదల చేసింది.

---

తెలంగాణలో ఆదాయ మార్గాల ద్వారా నిధుల సమీకరణ పై దృష్టి సారించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారితో కలిసి ఆదాయ సమీకరణ మార్గాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న  కార్యక్రమాలకు ఆర్థిక  లోటు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

---

తెలంగాణ ప్రభుత్వం మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని  ఆ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో  బిజెపి జిల్లా అధ్యక్షులు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో నిన్న సమావేశమైన ఆయన మూసీ నది  ప్రక్షాళన, సుందరీకరణ, హైడ్రా వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇల్లు కూల్చడం సరికాదన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో వాణిజ్య నిర్మాణాలను మాత్రమే కూల్చాలని  సాధారణ ప్రజల నివాసాలను వారిని ఒప్పించిన తర్వాత మాత్రమే ఖాళీ చేయించాలన్నారు. ఈరోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, నిర్వాసితులతో మాట్లాడనున్నామని కిషన్ రెడ్డి  తెలిపారు.

---

ప్రముఖ పారిశ్రామిక వేత్త, టాటాసంస్థల గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ముంబైలోని వర్లి శ్మశాన వాటికలో మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిన్న అంత్యక్రియలను నిర్వహించింది. ఈ అంత్యక్రియలకు కేంద్ర ప్రభుత్వం తరపున హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, హాజరయ్యారు. దేశంలోని పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కాగా బుధవారం రాత్రి 11 గంటల 30 నిమిషాలకు ముంబాయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుప్రతిలో చికిత్స పొందుతూ రతన్ టాటా తుది శ్వాస విడిచారు.

---------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజైన ఈ రోజు మహర్నవమిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సింహవాహినిగా దర్శనమిచ్చే మహిషాసుర మర్ధినీ దేవిని దర్శిస్తే సకల భయాలు తొలగిపోతాయని ఆలయ అర్చకులు తెలిపారు. దసరా మహోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో ఈ రోజు భ్రమరాంబికాదేవి అమ్మవారు సిద్ధిదాయిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అలాగే అశ్వవాహనసేవ వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు. కాగా గత రాత్రి శ్రీశైల భ్రమరాంబికాదేవి మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నందివాహనంపై స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ క్రీడాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన క్రీడా సంఘాలతో నిన్న విజయవాడలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ –శాప్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో క్రీడా విధానం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, క్రీడారంగాన్ని ఆధునీకరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. త్వరలోనే క్రీడలకు సంబంధించిన శాప్ యాప్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు.

---------------------------

దసరా పండుగ నుంచి ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను పాటించేలా ప్రతిజ్ఞ చేయాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు వాహనదారులకు పలు సూచనలు చేస్తూ, వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఏటా లక్షా 60 వేల మంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తుండగా, తెలంగాణలో సగటుకు రోజుకు 20 మంది రహదారి ప్రమాదాల్లో మరణిస్తున్నారని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని ప్రమాణం చేయాలని కోరారు.

---------------------------

సమాజంలో బాలికల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ రోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా అక్టోబర్ 11వ తేదీన అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించాలని 2011 డిసెంబర్ 19వ తేదీన ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. లింగ వివక్షతను నిర్మూలించడం, బాలికలకు మెరుగైన ఆరోగ్యం కల్పించడం, అన్ని రంగాలలో వారికి సమాన అవకాశాలు కల్పించడం, బాలికలపై హింసలేని సమాజం నిర్మించడం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వాహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు నిన్నటితో ఘనంగా ముగిశాయి. చివరి రోజైన నిన్న సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చి పాటలతో ఆడి పాడారు. హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబరాలు గత రాత్రి సద్దుల బతుకమ్మతో ముగిశాయి.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో “శక్తి విజయోత్సవాన్ని” నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అభిషిక్త్ కిషోర్ నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద ఈ రోజు నుంచి ఈనెల 13 వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. దసరా పర్వదినం సందర్భంగా దుర్గాదేవి నవ శక్తి స్వరూపాలను స్మరించేందుకు, మహిళల్లో ఉన్న శక్తి, ధైర్యం, పట్టుదల వంటి అంశాలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సతీమణులతో పాటు వివిధ శాఖల మంత్రులు పాల్గొంటారని తెలిపారు.

======================